చదువులు సాఫీగా..



పాఠశాలల అభివృద్ధికి పీఎం ఎస్ఆర్ఐ పథకంలో జిల్లాకు ఐదు కోట్లు కేటాయింపు

- తొలివిడత 22 పాఠశాలలకు ఐదు కోట్ల రూపాయల కేటాయింపు
- ల్యాబ్స్, లైబ్రరీ గదులు తదితర పనులు చేసేలా ప్రణాళిక.. రెండో విడతలో మరిన్ని

భీమవరం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంతో (పీఎం ఎస్ఆర్ఐ) ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధుల వరద పారనుంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు చేసే అభివృద్ధితో పాటు కేంద్ర ప్రభుత్వం కొన్ని పాఠశాలలను ఎంచుకుని పీఎం ఎస్ఆర్ఐ పథకం ద్వారా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో మొదట విడతగా 22 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.5 కోట్లను కేటాయించి వీటిని అభివృద్ధి చేయనున్నారు. విద్యా బోధనలో భాగంగా అన్ని సౌకర్యాలు అందించే దిశగా ఈ పథకం అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఇప్పటికే అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసింది. జిల్లాలో 1375 ప్రభుత్వ పాఠశాలల్లో 99 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఉన్నత విద్యను అందించడంతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. పీఎం ఎస్ఆర్ఐ పథకం ద్వారా అవసరం ఉన్నచోట తాగునీటి ఆర్వో ప్లాంట్‌లు, లైబ్రరీ రూమ్‌లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ల్యాబ్‌లు, కిచెన్ గార్డెన్ ఫినిషింగ్‌లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, సోలార్ ప్యానల్స్ వంటి అభివృద్ధి పనులు చేయనున్నారు. సైకిల్ ర్యాంప్‌లతోపాటు క్రీడా మైదానంలో ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి క్రీడల కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. ల్యాబ్‌లో ఎక్విప్‌మెంట్స్‌ను ఏర్పాటు చేస్తారు. మొదటి విడత ఎంపికైన పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాక 2వ విడత మరికొన్నింటిని ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం ద్వారా కేటాయించిన నిధులతో పనులు చేయనున్నట్లు సమగ్ర శిక్ష డీఈ శక్తీశ్వరరావు తెలిపారు.

ఎంపికైన పాఠశాలలు

తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూలు, తణుకు జడ్పీ హైస్కూలు, ఇరగవరం జడ్పీ హైస్కూలు, చినకాపవరం జడ్పీ హైస్కూలు, ఆకివీడు జడ్పీ హైస్కూలు, కలవపూడి జడ్పీ హైస్కూలు, పెనుమంట్ర జడ్పీ హైస్కూలు, ఆచంట వేమవరం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ స్కూల్, ఎల్‌బీ చర్ల ఉన్నత పాఠశాల, పెంటపాడు జీహెచ్ఎస్ పాఠశాల, యండగండి పీహెచ్ఎస్ పాఠశాల, గూట్లపాడు జడ్పీ హైస్కూలు, భీమవరం జేఎల్‌బీ గరల్స్ ఉన్నత పాఠశాల, మొగల్లు జడ్పీ హైస్కూలు, కవిటం జడ్పీ హైస్కూలు, పాలకొల్లు బీఆర్ఎంవి మునిసిపల్ ఉన్నత పాఠశాల, కరగట్ల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, బల్లిపాడు జడ్పీ హైస్కూలు, వీరవాసం జడ్పీ హైస్కూలు, వేమవరం జడ్పీ హైస్కూలు, శివదేవుని చిక్కాల జడ్పీ హైస్కూలు, మొగల్తూరు జడ్పీ హైస్కూలు ఉన్నాయి.

ప్లస్ వన్‌పై ఫోకస్

- ప్రత్యేక దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే క్వాలిఫై లెక్చరర్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఒకటి నుంచి మధ్యాహ్న భోజనం ఏర్పాటు
- ల్యాబ్‌లు, అదనపు గ్రూపులపైనా దృష్టి పెట్టాలి



భీమవరం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చి, ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం ప్లస్ టూ జూనియర్ కళాశాలల అభివృద్ధికి, వాటిలో సౌకర్యాలు పెంచాలి. గత ఏడాది వరకు ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాలలుగానే కొనసాగాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అదనంగా కో-ఎడ్యుకేషన్ ప్లస్ వన్ జూనియర్ కళాశాలలుగా మరికొన్ని కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థుల సంఖ్య కొంత పెరిగినప్పటికీ కళాశాలల్లో విద్యకు సంబంధించి సౌకర్యాలు మరికొన్ని అందుబాటులోకి తీసుకువస్తేనే అవి రానున్న రోజుల్లో విద్యార్థులకు ఆకర్షణగా నిలుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 25 ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో 16 ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాలలుగా, 9 కో-ఎడ్యుకేషన్ కళాశాలలుగా కొనసాగుతున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కింద 470 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాలలు రెండేళ్ల క్రితం అందుబాటులోకి తీసుకువచ్చినా విద్యార్థులకు కావలసిన ప్రొఫెసర్లు గాని, ఎక్విప్‌మెంట్స్, ల్యాబ్‌లు ఏవీ ఏర్పాటు చేయలేదు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులతోనే విద్యాబోధన చేయించడంతో ఉత్తీర్ణత శాతం 20 శాతం లోపుగా నిలిచింది. దీంతో మరుసటి సంవత్సరం విద్యార్థుల చేరిక సంఖ్య పెద్దగా లేకపోయింది. ఎంపీసీ, సీఈసీ గ్రూపుల వరకే పరిమితం చేయడంతో ఇతర గ్రూపుల్లో చేరాలనుకున్న విద్యార్థులు ఈ కళాశాలల వైపు చూడకుండా ప్రైవేట్ బాట పట్టారు. ప్రభుత్వ పాఠశాల నుంచి పదో తరగతి పూర్తి చేసుకుని బయటకు వచ్చినా ఈ కళాశాలల్లో బాలురకు చేరే అవకాశం లేనందున వారు ప్రైవేట్ వైపు వెళ్ళాల్సి వచ్చింది. ఇన్ని విధాలుగా ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు ఆకర్షణగా గత వైసీపీ ప్రభుత్వంలో నిలువలేకపోయాయి. కళాశాలలు పదిలోపు విద్యార్థులతోనే సాగాయి.

కూటమి ప్రభుత్వం రాకతో..

ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి పెట్టింది. కో- ఎడ్యుకేషన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను ఉచితంగా అందించింది. దాతల సహకారంతో విద్యార్థులకు యూనిఫామ్ ఏర్పాటు చేశారు.



ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

నూతన సంవత్సర కానుకగా వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ ఇంటర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం ఈ మేరకు జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, మొదటి సంవత్సరం 1,461 మంది, ద్వితీయ సంవత్సరం 1,003 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. గత ఏడాది వరకు 16 ప్లస్ టూ మహిళా కళాశాలలు ఉండగా, ఈ ఏడాది మరో తొమ్మిది ప్లస్ వన్ కళాశాలలను కో-ఎడ్యుకేషన్‌గా ఏర్పాటుచేశారు. ఈ 25 ప్లస్ వన్ కళాశాలలుగా విద్యా సంవత్సరంలో కొనసాగుతున్నాయి. వీటిలో ఫస్టియర్ 261 మంది, సెకండియర్ 209 మందికి భోజనం పెట్టనున్నారు. ఇప్పటికే 1375 ప్రభుత్వ పాఠశాలల్లో 99 వేల 175 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉంది. తాజాగా ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో ఈ పథకం అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం వుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే తమకు ఇది ఎంతో ఉపయోగకరమని విద్యార్థులు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వాహకుల నుంచే ఈ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాలకు అర కిలోమీటర్‌లోపు దూరంలో ఉన్న పాఠశాల నుంచి భోజనాన్ని కళాశాలకు చేరుస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పాఠశాలకు కొంచెం దూరం ఉన్నప్పటికీ ప్లస్ వన్ కళాశాలలు పాఠశాలల్లోనే ఉన్నందున మధ్యాహ్న భోజనం ఆ విద్యార్థులకు అందించడం సులభతరం అవుతుంది.

ఇప్పుడు మధ్యాహ్న భోజనం పథకం అమలులోకి రానుంది. పాఠశాలల్లో ఎంపీసీ, సీఈసీ గ్రూపులు మాత్రమే నిర్వహిస్తున్నాయి. బైపీసీ, ఒకేషనల్ వంటి గ్రూపులు ఈ కళాశాలల్లో అందుబాటులోకి తెస్తే బాగుంటుంది. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ల్యాబ్‌లను, కంప్యూటర్ సౌకర్యాన్ని తీసుకురావాలి. ఇవన్నీ వచ్చే విద్యా సంవత్సరంలోగా అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే అతి చేరువలోనే ఇంటర్ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థులకు చదువుకోవడానికి వీలుగా ఉంటుంది. ప్రస్తుతం ప్రైవేట్ ఇంటర్ విద్యా సంస్థల్లో రెండేళ్లు చదువుకోవాలంటే లక్షకు పైగా సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. గ్రామాల వారీగా అందుబాటులో ఉన్న ఈ ప్లస్ వన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పల్లెల్లో విద్యార్థులకు ఉపయోగకరంగానే ఏర్పాటు చేసినట్లు అవుతుంది.

ప్రతిభ కనబరుస్తున్నారు



దిరుసుమర్రు ప్లస్ వన్ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరుస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారికి ఉత్తీర్ణత పెంచే దిశగా స్పెషల్ మెటీరియల్ ఇస్తున్నాం. బోధనలో ప్రణాళికగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులందరూ కలిసి యూనిఫామ్ ఏర్పాటుచేశాం. ఈ ఏడాది టెక్స్, నోట్ బుక్‌లు ప్రభుత్వం అందించడం విద్యార్థులకు సహకారంగా నిలిచింది.

– ఉదయ భాస్కరరావు, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు, దిరుసుమర్రు ప్లస్ వన్ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి

ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి



కళాశాలకు కిలోమీటర్ దూరం నుంచి వస్తా. ఈ ఏడాది విద్యా బోధన బాగుంది. ల్యాబ్ సౌకర్యాలు లేవు. అవి ఏర్పాటుచేస్తే ఇంకా బాగుంటుంది. ఇంటర్ విద్యాభ్యాసానికి సౌకర్యాలన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తేనే చదువులో రాణించగలం. లైబ్రరీ కూడా కళాశాలలో ఉంటే బాగుంటుంది.

– కె.మహాలక్ష్మి, విద్యార్థిని, గొల్లవానితిప్ప

ఇతర గ్రూపులు కావాలి



విద్యాబోధన బాగుంది. సౌకర్యా లే తక్కువున్నాయి. ఎంపీసీ, సీఈసీలే ఉన్నాయి. బైపీసీ, ఇతర గ్రూపుల్లో చేరాలనుకునే వారికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అన్ని గ్రూపులు అందుబాటులోకి తీసుకురావాలి. ల్యాబ్‌లు లేక సబ్జెక్టులో ప్రయోగాత్మకంగా వెనుకబడాల్సి వస్తోంది.

– బి.హేమ, విద్యార్థిని





హతుడు పర్లయ్య, నిందితుడు శ్రీధర్‌వర్మ (ఫైల్ ఫొటోలు)

పార్శిల్‌లో మృతదేహం ఆచూకీ లభ్యం

- కాళ్ల శివారు గాంధీనగర్‌కు చెందిన పర్లయ్యదిగా గుర్తింపు
- మిస్సింగ్‌కు రెండు రోజుల ముందే చెరువు, తాపీ పనులకు తీసుకువెళ్లిన శ్రీధర్‌వర్మ
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు.. కృష్ణా జిల్లాలో పట్టివేత.. కొలిక్కి వస్తున్న కేసు

■ మెయిన్‌లో..



సంక్షామం

- సంక్షేమ హాస్టల్స్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అరకొర వసతులు
- శిథిల భవనాలు.. వెలిసిపోయి కళా విహీనంగా గోడలు
- అధ్వానంగా వాష్‌రూమ్స్
- దోమల మోత.. పలుచోట్ల నేలపైనే నిద్ర
- భోజనానికి ఇబ్బందులు.. స్టడీ అవర్స్ లేవు 6

బంగారం వ్యాపారి పట్టివేత

- 6.786 కేజీల బంగారం, 106 కేజీల వెండి, కారు, రూ.3 లక్షల నగదు స్వాధీనం
- తోటి వ్యాపారులను మోసం చేసి పరార్ 7



పెనుగొండ ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పార్టీలకతీతంగా పథకాలు

పెనుగొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో కక్ష సాధింపులు, పక్షపాత ధోర ణి కారణంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకున్నారని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ విమర్శించారు. సోమవారం ఉదయం పెనుగొండ పంచాయతీ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్‌లు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన రెండు వేల దరఖాస్తులను స్వీకరించారు. పితాని మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అందించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాబోయే కొత్త సంవత్సరంలో సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సీఎం ప్రణాళికలు రచించారన్నారు. పెనుమంట్ర మండలం నెగ్గిపూడి, పండిత విల్లూరు జగనన్న కాలనీల్లో రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 50 మందికి సీఎం సహాయనిధి ఇస్తున్నట్టు చెప్పారు. వెలిచేటి బాబూ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, నక్కా వేద వ్యాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



మేం రేపటి రైతులం

జాతీయ రైతు దినోత్సవాన్ని పెనుగొండ భాష్యం స్కూలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. నారు వేసేలా పొలాన్ని సిద్ధం చేసేందుకు రైతుల వేషధారణలతో చిన్నారులు నడుం బిగించారు. జానపదాలతో ఆడి పాడారు.

హైవే స్పీడేదీ?



రూ.1200 కోట్లు కేటాయించిన కేంద్రం

- ఆకివీడు-దిగమర్రు రోడ్డు నిర్మాణాలకు మూడు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- కేంద్రం వద్ద పెండింగ్.. నిర్ణయం తీసుకోకుంటే నిధులు గోవిందా!

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆకివీడు నుంచి భీమవరం మీదుగా పాలకొల్లు మండలం దిగమర్రు వరకు జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం రూ.1,200 కోట్లు కేటాయించింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయితేనే నిధులు మనుగడలో ఉంటాయి. జాతీయ రహదారుల అథారిటీ అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను కేంద్రానికి పంపాలి. అక్కడ ఆమోదం పొందిన తర్వాత టెండర్లు ఖరారు చేస్తారు. అప్పుడే కేంద్ర నిధులు వినియోగంలోకి వస్తాయి. లేదంటే మురిగిపోతాయి. మళ్లీ కొత్తగా నిధులు కేటాయించాలి. వాస్తవానికి పామర్రు నుంచి దిగమర్రు వరకు జాతీయ రహదారిని రెండు దశల్లో నిర్మిస్తున్నారు. తొలి దశలో కృష్ణా జిల్లా పామర్రు నుంచి ఆకివీడు వరకు పనులు కొనసాగుతున్నాయి. జిల్లా పరిధిలో ఆకివీడు నుంచ దిగమర్రు వరకు రెండో దశలో జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలి. భీమవరం వద్ద బైపాస్ ఎలివేషన్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం ఉండి రహదారి నుంచి భీమవరం మీదుగా వెళ్లిన బైపాస్‌నే జాతీయ రహదారికి కేటాయించాలని ప్రతిపాదించారు. రెండు వైపులా స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఇది నిలిచిపోయింది. తాజాగా మూడు ఎలివేషన్‌లను ప్రతిపాదిస్తూ జాతీయ రహదారి అథారిటీకి పంపారు. భీమవరం దిగువ ప్రాంతం నుంచి ఒకటి, గరగపర్రు వైపు రెండింటిని ప్రతిపాదించారు. మూడింటిలో ఒక దానిని జాతీయ రహదారి అథారిటీ ఆమోదించాలి. ఇవి మూడు నెలల క్రితమే పంపించగా అవి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. మార్చిలోగా టెండర్ల ప్రక్రియకు చేరుకోనట్టయితే నిధులు మురిగిపోతాయి. ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు. జాతీయ రహదారి అథారిటీ వద్ద రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆమోదిస్తేనే భూసేకరణ

జాతీయ రహదారి అథారిటీకి పంపిన మూడింటిలో ఒక దానికి ఆమోదం తెలిపితేనే భూసేకరణకు మార్గం సుగమం అవుతుంది. డీపీఆర్‌ను సిద్ధం చేయనున్నారు. ఉండి నుంచి భీమవరం మీదుగా వీరవాసరం వరకు బైపాస్ ద్వారానే జాతీయ రహదారి వెళ్లనుంది. ఆకివీడు నుంచి ఉండి వరకు ఎటువంటి ఇబ్బంది లేదు. వీరవాసరం నుంచి పాలకొల్లు మండలం దిగమర్రు వరకు భూ సమస్యలు లేవు. ఉండి నుంచి భీమవరం మీదుగా వీరవాసరం వరకే సమస్య ఏర్పడింది. భీమవరం వద్ద ఎటు వైపు నుంచి జాతీయ రహదారి వెళ్లాలనే విషయమై తర్జనభర్జనలు పడ్డారు. మరో మూడు నెలలు కాల వ్యవధి మాత్రమే ఉంది. ఈలోగా కేంద్రం కేటాయించిన నిధులు మురిగిపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగంపై ఉంది. లేదంటే మరో ఏడాది వరకు వేచి చూడాలి. కేంద్రం కొత్తగా మళ్లీ బడ్జెట్ కేటాయించాలి. జిల్లా అభివృద్ధిలో ఈ రహదారి కీలకం కానుంది.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కలెక్టరు చదలవాడ నాగరాణి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సమావేశ మందిరంలో ఫిర్యాదుదారుల నుంచి కలెక్టరు నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 147 అర్జీలు వచ్చాయి. పూర్తి దివ్యాంగుడినైన తనకు మూడు చక్రాల స్కూటర్ ఇప్పించాలని భీమవరం నరసయ్య అగ్రహారానికి చెందిన బైలాపాటి గొల్ల రామకృష్ణ కోరారు. ఆక్రమణకు గురైన మందపాడు రహదారిని సర్వే చేయించి, వాటిని తొలగించాలని ఆకివీడు మండలం మందపాడుకు చెందిన పెరుమాళ్ళ రామకృష్ణ కోరారు. బిల్డింగ్ పనిచేస్తున్న తనకు కరెంటు షాక్‌తో రెండు చేతులు పోయాయని, రూ.15 వేలు పెన్షను మంజూరు చేయాలని యలమంచిలి మండలం ఆర్యపేటకు చెందిన తోటే సూర్యనారాయణ కోరారు. ఒంటరి మహిళనైన తనకు ఎలాంటి ఆదాయం లేనందున మంజూరు చేయాలని గణపవరం మండలం కేశవరానికి చెందిన. అలుగోలు సూరమ్మ కోరారు.

11 ఫిర్యాదులు స్వీకరణ

భీమవరం క్రైం, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మరల మరల అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో తదితర మోసాలపై వచ్చిన 11 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. వారి సమస్యలను ఆలకించారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.

26 నుంచి చెరుకువాడ రైల్వే గేటు మూసివేత

ఉండి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా ఉండి మండలం చెరుకువాడ రైల్వే గేటును ఈ నెల 26 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. చెరుకువాడ నుంచి అర్తమూరు, కవిటంపాకలు వెళ్లే ప్రజలు, ప్రయాణీకులు ఉండి నుంచి ఉప్పుగుంట మీదుగా వెళ్లాలని సూచించారు.

మూతపడిన వసతి గృహాలు..



ముదినేపల్లిలో మరమ్మతులకు నోచుకోని ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహ భవనం

ముదినేపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ముదినేపల్లిలో కళాశాల స్థాయి బాలుర, బాలికల వసతిగృహాల భవనాలు శిథిలం కావడం, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మూతపడ్డాయి. బాలుర వసతి గృహం భవనం మరమ్మతులు చేయాల్సి ఉండగా, వాష్‌రూమ్స్ పనికి రాకుండా పోయాయి. గత ఏడాది విద్యార్థులు చేరకపోవడంతో వసతిగృహాన్ని మూసివేశారు. భవనం మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ లేదంటూ జాప్యం చేస్తున్నారు. కళాశాల స్థాయి ఎస్సీ బాలికల వసతిగృహం కూడా మూతబడింది. వసతిగృహ భవనం శిథిలం కావడంతో విద్యార్థినులు చేరలేదు. ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు చేరినా వసతి గృహంలో ఉండే వీలులేక ప్రైవేట్ భవనంలో ఉంటున్నారు. పగలు వసతిగృహంలో భోజనం చేసి రాత్రి ప్రైవేట్ భవ నంలో నిద్రించాల్సిన పరిస్థితి. బీసీ బాలుర వసతిగృహం వాష్‌రూమ్స్ మరమ్మతు చేయించాల్సి ఉంది. నీటి సమస్య పరిష్కారం కాలేదు.

పెంటపాడు



పెంటపాడులో మూతపడిన ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం

బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో హాస్టల్‌నే మూసేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనతో ప్రాథమిక పాఠశాలలో రెండు గదులు కేటాయించి తాత్కాలికంగా వసతి గృహాన్ని నడిపిస్తు న్నారు. ఎస్సీ బాలుర వసతి గృహం భవనం కూడా శిథిలా వస్థకు చేరి పెచ్చులూడుతోంది. వాష్‌రూం డోర్లు కూడా లేవు. పరిమెళ్ల వసతి గృహంలో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. పనులు పూర్తయితే పెంటపాడు బాలుర వసతి గృహం మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు చెబు తున్నారు. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ప్రజలు కోరుతున్నారు.

పెంటపాడు: సాంఘిక సంక్షేమ వసతి గృహాలు వసతుల లేమితో అల్లాడుతున్నాయి. పురాతన భవనాలు కావడంతో ఎప్పుడు పడిపోతాయో తెలియని స్థితిలో విద్యార్థులు భయపడుతున్నారు. పెంటపాడులో ఎస్సీ బాలురు, ఎస్సీ బాలికలు, పరిమెళ్లలో ఎస్సీ బాలురు మొత్తం మూడు వసతి గృహాలు ఉన్నాయి. పెంటపాడులో బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థులు లేకపోవడంతో మూసేశారు. ప్రస్తుతం 3 వసతి గృహాలలో సరైన వసతులు లేవు. పెంటపాడు

వీరవాసరం



వీరవాసరం మండలం అండలూరులో మూతపడిన ఎస్సీ సంక్షేమ బాలుర వసతి గృహం

వీరవాసరం (భీమవరంటౌన్): అండలూరులో నిర్మించిన సాంఘిక సంక్షేమ వసతి గృహం (బాలురు)లో విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. గత ఏడాది నుంచి ఈ పరిస్థితి ఉందని చెబుతున్నారు. 2013లో ఎస్‌సిఎస్‌పి నిధులు రూ.80 లక్షలతో నిర్మాణానికి 2013 జూన్ 28న అప్పటి ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు శంకుస్థాపన చేశారు. 2016లో నిర్మాణం పూర్తి కావడంతో అదే సంవత్సరం ఏప్రిల్ 22న మరలా ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు వసతిగృహాన్ని ప్రారంభించారు. కొంత కాలం వసతి గృహం కొనసాగినా తర్వాత విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. ప్రస్తుతం ఖాళీగానే ఉంది.



తణుకు బీసీ బాలికల వసతిగృహంలో స్తంభానికి ప్రమాద హెచ్చరిక సూచిక

గ్రామాల్లో విద్యా సౌకర్యాలు లేకపోవడం, ఆర్థిక స్థోమత లేని పేదలకు సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు పెద్ద ఊరట. అక్కడ కూడా వారు సమస్యలతో సతమతమైతే..? చదువు సాగించడం ఎలా..? వారి భవిష్యత్ మెరుగుపడేదెలా..? దీనికి బాధ్యత ఎవరిది. సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు, సమస్యలు చూసిన వారి నుంచి ఎదురయ్యే ప్రశ్నలు. విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలం కావడంతో కొన్ని చోట్ల హాస్టల్స్ మూతపడడం విచారకరం. గ్రామాల్లో పేద విద్యార్థులు కొందరు చదువుకు స్వస్తి చెబితే.. మరికొందరి తల్లిదండ్రులు స్థాయికి మించి అప్పుచేసి మరీ పిల్లలను చదువు కోసం ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు వసతి గృహాల్లో పరిస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఆంధ్రజ్యోతి పరిశీలన



సంక్షామం

వసతి గృహాల్లో భయం భయంగా పేద విద్యార్థులు

- అరకొర వసతులు
- శిథిల భవనాలు
- వాష్‌రూమ్స్ అధ్వానం
- దోమల మోత
- భోజనానికి ఇబ్బందులు
- స్టడీ అవర్స్ లేవు



మొగల్తూరులో అద్దె భవనంలో హాస్టల్



తణుకు హాస్టల్‌లో నేలపై పడుకున్న విద్యార్థులు

వసతుల లేమి

చింతలపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో సాంఘిక సంక్షేమ హాస్టల్స్ అధ్వానంగా ఉన్నాయి. పట్టణంలోని శెట్టివారిగూడెం రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 125 మంది విద్యార్థులున్నారు. బాత్‌రూమ్ సదుపాయాలు సరిగా లేవు. తలుపులు ఊడిపోయి, గోడలకు పెచ్చులూడి అధ్వానంగా ఉన్నాయి. కొన్ని భవనాల్లో స్లాబ్ లీకేజీలు, పైపులైను లీకేజీలు, ప్రహరీ సమస్యలు ఉన్నాయి. హాస్టల్స్‌తోపాటు సంక్షేమ కార్యాలయం కూడా అధ్వానంగా ఉంది. పట్టణంలో బాలికల హాస్టల్‌లో కూడా సరైన సౌకర్యాలు లేవు. శింగగూడెంలో హాస్టల్ ఒకచోట, పాఠశాల మరొకచోట ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ దాటాల్సిందే.

చలితో వణకాల్సిందే..

ఇరగవరం: తణుకు పట్టణంలోని సంక్షేమ హాస్టల్ విద్యార్థులు చలి తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహం కిటికీలు ఎముకలు కొరికే చలితో వణుకుతుంటే దోమలు దాడి చేస్తున్నాయి. తణుకు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సుమారు 50 మంది విద్యార్థులు అరకొర సదుపాయాల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు లేకపోవడంతో ఇళ్ల నుంచి చాపలు తెచ్చుకుని నిద్రిస్తున్నారు. దాతలు ఇచ్చిన దుప్పట్లతో చలి నుంచి రక్షించుకుంటున్నారు. ఇరగవరం కాలనీ బీసీ బాలికల వసతిగృహంలో సుమారు 28 బాల బాలికలు ఉంటున్నారు. 1988 నాటి భవనం శ్లాబ్‌పై పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. విద్యార్థులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. చలి తీవ్రతను పూరిస్థాయిలో దుప్పట్లు అందజేయడం లేదు. వసతి గృహంలో ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విష సర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారు.

ఉండిలో విద్యార్థులు లేరు..

ఉండి: స్థానిక బాలికల వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య స్వల్పం. ప్రవేశాలు లేకపోవడంతో కేవలం 24 మంది విద్యార్థినులు మాత్రమే ఉన్నారు. హాస్టల్ భవనంలో సుమారు 12గదుల్లో 8గదులు విద్యార్థులకు కేటాయించారు. అయినా ఖాళీగానే వున్నాయి. గతంలో 50 నుంచి 60 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం తగ్గిపోయారు. 3వ తరగతి 5గురు, 4వ తరగతి ఒకరు, 5వ తరగతి ముగ్గురు, 6వ తరగతి 5గురు, 7వ తరగతి 4గురు, 8వ తరగతి 4గురు, 9వ తరగతిలో ముగ్గురు ఉన్నారు. విద్యార్థులకు కొంత వరకు మెరుగైన సౌకర్యాలు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు లేరు. ఉదయం, సాయంత్రం ఒక గంట పాటు విద్యార్థులకు బోధనకు ట్యూషన్ మాస్టారును నియమిస్తే ప్రవేశాలు పెరుగుతాయని పలువురు చెబుతున్నారు.

కింద పడుకోవాల్సిందే!

ఆచంట: మండలంలోని వల్లూరులో మాత్రమే బీసీ బాలికల వసతి గృహం ఉంది. హాస్టల్‌లో మూడు నుంచి 9వ తరగతి విద్యార్థులు 25 మంది మాత్రమే ఉన్నారు. హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు స్టడీ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. హాస్టల్‌లో సదుపాయాలున్నా విద్యార్థులకు బెడ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. వాష్‌రూమ్‌కు నీటి సౌకర్యం లేదు. హాస్టల్‌కు వెళ్లడానికి రహదారి లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

సరిపడా గదులు లేవు

ఉంగుటూరు: మండలంలోని హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. కైకరం బాలుర ప్రత్యేక వసతి గృహం, చేబ్రోలు బాలికల వసతిగృహాల్లో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కైకరంలో 60 మంది పిల్లలకు సరిపడా గదులు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ లేక ఇబ్బందులు పడుతున్నారు. చేబ్రోలు బాలికల వసతి గృహం శ్లాబు లీకవుతోంది. గోడలు పెచ్చులూడుతున్నాయి.

అద్దె భవనాల్లో వసతి

మొగల్తూరు: తీర ప్రాంత మండలంలో వసతి గృహాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయి. మొగల్తూరు బాలురు, బాలికల వసతి గృహాలు, ముత్యాలపల్లి వసతి గృహం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పాతపాడులో సొంత భవనంలో పూర్తి సౌకర్యాలు లేవు. అద్దెకు చెల్లించకపోవడంతో ముత్యాలపల్లి హాస్టల్ తుఫాన్ రక్షిత భవనంలో నిర్వహిస్తున్నారు. మొగల్తూరు బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో సుమారు 2 దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. బాలికల వసతి గృహం ఐదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది.

అరుగులపైనే భోజనం

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 247మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అరుగులు, ఆవరణలో కూర్చుని భోజనం చేయాల్సిందే. కొందరు విద్యార్థులకు భోజన ప్లేట్‌లు, గ్లాసులు లేకపోవడంతో ఒక ప్లేట్‌లో ఇద్దరు విద్యార్థులు భోజనం చేస్తున్నారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో సరిపడిన గదులు, క్రీడా మైదానం లేదు. విద్యార్థులు ఉతికిన దుస్తులు ప్రహరీ, భవనం గోడపై ఆరబెడుతున్నారు. బాలుర వసతి గృహం వద్ద విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే బట్టలు ఆరేస్తున్నారు. బుట్టాయిగూడెం మండలం... బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల పాఠశాల సిబ్బంది స్థానికంగా నివాసం లేకపోవడంతో సకాలంలో విధులకు సకాలంలో హాజరుకావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.



జీలుగుమిల్లి ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలో భోజనం



చింతలపూడి బాలుర సంక్షేమ హాస్టల్‌లో అధ్వాన వాష్‌రూమ్స్



ముదినేపల్లి బీసీ బాలుర వసతిగృహంలో నీరు లేని టాయిలెట్స్



ఉంగుటూరు మండలంలోని కైకరం హాస్టల్‌లో ఊడుతున్న డోర్లు



వినియోగదారుడా.. మేలుకో

- వస్తు, సేవలు పొందడంలో జాగ్రతలు పాటించాలి
- హక్కుల పరిరక్షణకు వినియోగదారుల ఫోరం

ఆకివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల మార్కెటింగ్ మాయాజాలంలో చిక్కిన వినియోగదారు వస్తు, సేవల లోపం ఎదుర్కొంటాడు. సమీప దుకాణాల నుంచి, ఆన్‌లైన్ వ్యాపారులందరి దృష్టి వినియోగదారుపైనే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతా వినియోగదారుపైన ఆధారపడి ఉండడనం అతిశయోక్తి కాదు. అంతటి కీలకమైన వినియోగదారులకు ఒక రోజు ఉంది. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

వినియోగదారులకు ఎంతటి ప్రాధాన్యం ఉన్నా వస్తు సేవలు పొందడంలో జాగ్రత్తలు పాటించాలి. బంగారం, వెండి వంటి ముఖ్యమైన వస్తువులు కూడా బిల్లులు లేకుండా అమ్మకాలు సాగుతుంటాయి. పన్నులు ఎగ్గొట్టడానికి వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తారు. వీటన్నింటిని అధిగమించి వినియోగదారు నాణ్యమైన సేవలు పొందవచ్చు. వస్తువుల కొనుగోలులో నాణ్యత, తయారీ, ముడిసరుకు తదితర అంశాలు పరిశీలించాలి. కొనుగోలు చేసిన వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. గ్యారంటీ, కాలం, కాలపరిమితి తేదీ, లేబుల్ వంటి అంశాలు సరి చూసుకోవాలి. సమస్య తలెత్తినప్పుడు ముందుగా సంబంధిత అధికారి లేదా వ్యాపారికి నోటీసు ఇవ్వాలి. కొనుగోలు చేసిన సరుకు, వస్తువు నాణ్యత పరిశీలన, సేవల్లో లోపాలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. తప్పుదారి పట్టించే ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలి. సహజ వనరులను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

ఫిర్యాదు ఇలా..

- నష్టపోయిన వినియోగదారు వినియోగదారుల సంఘానికి తెలియజేయాలి.
- కొన్న వస్తువు, జిల్లా ఫోరంలో సేవల విలువలు కోరిన నష్టపరిహారంతో కలిపి లక్షల నుంచి కోటిలోపు ఉంటే జిల్లా కమిషనర్‌కు, కోటికి మించితే రాష్ట్ర కమిషనర్, మూడు కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల కమిషర్‌నర్‌కు ఫిర్యాదు చేయాలి.
- ఫిర్యాదుదారుడు లక్షలోపు నష్టపరిహారానికి నగదు చెల్లించవలసిన అవసరం లేదు.
- కేసు తొంబై రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

ఉద్యమం నీరుగారుతోంది



వినియోగదారుల ఉద్యమం నీరుగారిపోతుంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆదరణ కరువైంది. రక్షణ చట్టాలున్నా ఉపయోగపడడంలేదు. జిల్లా ఫోరంలు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలి. అధిక సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫోరం తీరు అమలుకు కఠిన నిబంధనలు రూపొందిచాలి. కల్తీ, దగా, మోసం, పెరిగిపోతున్న తరుణంలో బలమైన రక్షణ చట్టం చేయాలి.

బొబ్బిలి బంగారయ్య, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తిచేయండి

అధికారులతో పశ్చిమ కలెక్టర్ నాగరాణి సమీక్ష



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహ భవనాల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో హౌసింగ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో సోమవారం వసతి గృహాల మరమ్మతులపై సమీక్షించారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు రూ1.29 కోట్లు, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.15 లక్షల చొప్పున తొలి విడత పరిపాలన ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. గృహ నిర్మాణ శాఖకు ముందస్తు ఆదేశాలు ఇచ్చి మరమ్మతు పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వసతి గృహాలలో శ్లాబ్, వాష్‌రూమ్ మరమ్మతులు, డోర్లు, ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, ఆర్వో ప్లాంట్, తదితర పనులను పూర్తి చేయాల్సి ఉంది. సీసీ కెమెరాలు, పరుపులు, ఇన్వర్టర్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి దాతల సహకారాన్ని కోరడం జరిగిందని, ఏ వసతి గృహాలకు ఏర్పాటు చేయాల్సి ఉందో నివేదిక అందజేయాలని సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ హరిహరనాథ్, ఈఈ బి.పిచ్చయ్య, బీసి సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్ కెఎస్ఎస్ గణపతిరావు, ఎస్టీ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి బీవీఎస్‌బి రామాంజనేయరాజు పాల్గొన్నారు.



హారతులందుకుంటున్న ఉత్సవమూర్తులు

విలాస మండపంలో ధనుర్మాస ఉత్సవం

తిరువీధుల్లో తిరుగాడిన శ్రీవారు

ద్వారకాతిరుమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండపై శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. విలాస మండపంలో ఉభయ దేవేరులు, గోదాదేవితో కొలువైన శ్రీవారికి సోమవారం జరిగిన ధనుర్మాస ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ముందుగా స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. అనంతరం గజ, అశ్వ వాహన సేవలతో పాటు మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగించారు. తరువాత మండపంలో గోదాదేవితో సహా శ్రీవారి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చి ప్రసాద వితరణ చేశారు.

మంచు ముసుగు



మంచు ముసుగులో ప్రధాన గోపురం



హిమవర్షంలో గజలక్ష్మి మార్నింగ్ వాక్

శ్రీవారు కొలువైన శేషాచలం కొండపై మంచు ముసుగులా పరుచుకుంది. భానుడి లేలేత కిరణాలను పొగమంచు తెరలు కమ్మేశాయి. ఇక మేలుకోవయ్యా శ్రీనివాసా.. అంటూ ఆలయ అర్చకులు స్వామి వారిని మేల్కొలిపి అర్చనలు చేశారు. మంచు పరదాలతో క్షేత్ర పరిసరాలు కనిపించలేదు. శేషాచల కొండపై రహదారులు సైతం సరిగా కనిపించక భక్తులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల లైట్ల ఆధారంగా వారు ఆలయానికి చేరుకున్నారు. శ్రీవారి ఆలయ రాజగోపురాల సముదాయం, ఘాట్ రోడ్డు, శివాలయం, ఇలా శేషాచల ప్రాంతమంతా మంచులో చిక్కుకుంది. మంచుతెరలను చీల్చుకుని భానుడు వచ్చే సుందర దృశ్యాలను వీక్షించిన భక్తులు పరవశించారు. **- ద్వారకాతిరుమల**





అనుగ్రహభాషణం చేస్తున్న జీయర్

ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది

రామచంద్ర రామానుజ జీయర్

భీమవరంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం అతి పవిత్రమైనదని, మోక్ష సాధనకు భగవన్నామ స్మరణ ఒక్కటే శరణ్యమని భీమవరం బాష్యకార సిద్ధాంతి పీఠాధిపతి త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ అన్నారు. వెంకయ్య వీధిలోని పీఠంలో సోమవారం ధనుర్మాస తీర్థ గోష్టి నిర్వహించారు. దేవతలకు ఉత్తరాయణం పగలని, దక్షిణాయనం రాత్రి అని వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. అనంతరం మంది భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. పీఠం సభ్యులు కారుమూరి చినబాబు, చెరుకువాడ రంగసాయి, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోదాదేవిగా అలరించిన చిన్నారి

చిన్న తిరుపతికి సోమవారం గోదాదేవి అలంకరణలో వచ్చిన చిన్నారి శ్రీవారిని దర్శించుకోడం ఆకట్టుకుంది. దాస్యం వరప్రసాద్, మయూరిల కుమార్తె ఖ్యాతి గోదాదేవిగా అలంకరించుకుని ఆలయానికి వెళ్లింది. ధనుర్మాసంలో గోదాదేవి ప్రాశస్త్యాన్ని పురస్కరించుకుని ఆమెను ఇలా అలంకరించారు. **- ద్వారకాతిరుమల**

27న జిల్లా మత్స్యకార సొసైటీ ఎన్నిక

» బరిలో ఐదుగురు అభ్యర్థులు

నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యకార సహకార సంఘం ఎన్నిక ఉత్కంఠంగా మారింది. ఈనెల 27న ఏలూరులో జరిగే అధ్యక్ష ఎన్నికకు ఐదుగురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. వీరిలో ప్రస్తుత అధ్యక్షుడు ఆండ్రాజు చల్లారావుతో పాటు పెంటపాడు నుంచి బీజేపీ మద్దతుతో ఒకరు, మెట్ట ప్రాంతం నుంచి మరొకరూ ఉండగా నరసా పురం నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు. దీంతో ఈసారి ఎన్నిక ఏమవుతుందోనన్నది సస్పెన్స్‌గా మారింది. గత నెలలో ఈ ఎన్నిక జరగాల్సి ఉంది. అయితే న్యాయస్థాన పరిధిలో ఉండటంతో అధికారులు వాయిదా వేశారు. ఈక్రమంలో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సొసైటీ ఎన్నికలను కూడా పూర్తి చేశారు. దీంతో ఉమ్మడి పశ్చిమలో 137 సొసైటీల అధ్యక్షులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే బరిలో నిలిచిన అభ్యర్థులు ఈసారి తమకు మద్దతు ఇవ్వాలని ప్రచారాన్ని కూడా పూర్తి చేశారు. ఇటు రాజకీయ మద్దతును కూడగట్టుకుంటున్నారు. దీంతో ఎన్నికలు జరిగితే విజయం ఎవర్ని వరిస్తుందోనన్నది పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమలో పోలవరం, తాళ్లపూడి, కొవ్వూరు, సిద్ధాంతం, నిడదవోలు, ఆచంట, పోడూరు, యలమంచిలి, నరసాపురం, మొగల్తూరు, భీమవరం, కొల్లేరు ప్రాంతాల్లో మత్స్యకారులు అత్యధికంగా ఉన్నారు. వేట సాగించే వీరంతా సొసైటీలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందుకుంటున్నారు. ఒక్కక్క సొసైటీలో 500 నుంచి 1500 మంది దాకా సభ్యులు ఉంటారు. కొన్ని సొసైటీలు 200 మందికే పరిమితయ్యాయి. మెజార్టీ సొసైటీలు పశ్చిమలోనే ఉన్నాయి. అందులో అత్యధికంగా నరసాపురం ప్రాంతంలోనే ఉన్నాయి. గత రెండు పర్యాయాలు నరసాపురం ప్రాంతానికి చెందిన ఆండ్రాజు చల్లారావు జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఆయన వైసీపీలో ఉన్నారు. ఆయన్ని ఈసారి గెలవనివ్వకుండా కూటమి పార్టీలు గట్టి ప్రయత్నం చేస్తున్నాయి. దానిలో భాగంగానే నరసాపురం నుంచి జనసేనకు చెందిన మైలా వసంతరావు, తిరుమాని సీత మహాలక్ష్మి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ ఈ ఎన్నికకు ఇంత పోటీ లేదు. ఈసారి గట్టి పోటీ ఉండటంతో అధికార యంత్రాంగం కూడా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు.



జిల్లా హ్యాండ్ బాల్ కార్యవర్గం

పాలకోడేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శృంగవృక్షం పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా హ్యాండ్ బాల్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ప్రెసిడెంట్‌గా ఎంవీ ప్రసన్న లక్ష్మి, సెక్రటరీగా కె.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా పి.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర నిర్వాహకుడు గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. శాప్ నుంచి కోచ్ దుర్గారావు, పీడీలు చిట్టిబాబు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

పగిలిన మంచినీటి సరఫరా పైప్‌లు

240 గ్రామాలకు నిలిచిన మంచినీటి సరఫరా



మెయిన్ లైన్ మరమ్మతులకు గురై నీరు లీకవుతున్న దృశ్యం

పోలవరం డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి మంచినీటి సరఫరాకు గ్రహణం పట్టింది. ఇప్పటికే రెండు వారాలుగా పైపులైన్లు పగిలిపోయి పోలవరం మండలానికి నీటి సరఫరా నిలిచిన నేపథ్యంలో సత్యసాయి మంచినీటి కార్మికులు యడ్లగూడెం సమీపంలో మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరించగా పాతపోలవరం వద్ద మరో రెండు చోట్ల పైపులైన్లు పగిలి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో మళ్ళీ నీటి సరఫరా నిలిపి మరమ్మతులకు ఉపక్రమించారు. తాజాగా సోమవారం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద మెయిన్ పైపులైన్ల పైపులు పగిలిపోయి నీరు భారీ స్థాయిలో లీకవుతున్న నేపథ్యంలో సత్యసాయి కార్మికులు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. పైపులు పగిలిన ప్రాంతంలో మరమ్మతులు చేయడానికి నీటిని మోటార్లతో తోడే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంచి నీటి సరఫరా నిలిపివేయడంతో పోలవరం, కొవ్వూరు, గోపాలపురం, చింతలపూడి నియోజక వర్గాల్లో 17 మండలాల్లో సుమారు 240 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో గ్రామాల ప్రజలు మంచినీటి అవసరాలకు ఇబ్బందులకు గురవుతు న్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన పైపులైన్లు వేసి మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



ఏలూరు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరుజిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ కోచ్ జి.కె.వి సుబ్బారావు స్మారకంగా జిల్లా నిడ్జెమ్ అథ్లెటిక్స్‌మీట్ సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలను సినీదర్శకుడు మలినేని గోపిచంద్ సతీమణి సత్య ప్రారంభించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ప్రసాదరావు, కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి



చిన్నారిని పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వసర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో సోమవారం 9 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యా సంస్థలు, బ్యాంక్ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు స్వచ్ఛంద రక్తదాతల సహకారంతో తలసేమియా చిన్నారులకు 1000 నుంచి 1200 రక్త యూనిట్లు సరఫరా చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌వీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఆర్ఎస్ ఆర్కె వర ప్రసాదరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, డాక్టర్ జి.స్పందన పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు

భీమవరం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు. భీమవరం మండల ఎల్‌వీఎన్ పురంలో పాలా గణపతి మద్యం విక్రయిస్తుండగా 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఉమా మహేశ్వరరావు, సునీల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

బిడ్డకు వరం.. తల్లికి ఆరోగ్యం!



భీమవరంలో తల్లిపాల సేకరణ బ్యాంకు కార్యాలయం (ఇన్‌సెట్‌లో) తల్లి నుంచి పాలు సేకరించే పరికరం



ఇదే తల్లిపాల బ్యాంకు లక్ష్యం

» భీమవరంలో తల్లిపాల బ్యాంకు ఏర్పాటు
» రాష్ట్రంలో ఇది రెండవ బ్యాంకు
» బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల ఇద్దరికి ఎన్నో ప్రయోజనాలు

భీమవరం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం. బాల సంజీవిని అయిన తల్లిపాలు బిడ్డకు అందాలనే ఆశయంతో మహిళల్లో అవగాహన కల్పించేందుకు భీమవరంలో తల్లిపాల బ్యాంకును నెలకొల్పారు. భీమవరం ఏరియా ఆసుపత్రిలో దీనిని ప్రారంభించారు. పుట్టిన బిడ్డకు సరిపడిన పాలు కంటే అధికంగా ఉంటే ఆ తల్లి నుంచి సేకరించి భద్రపరుస్తారు. ఇలా సేకరించిన పాలు ఏడాది భద్రంగా ఉంటాయి. దానికి సంబంధించిన యంత్ర పరికరాలను తల్లిపాల బ్యాంకులో సిద్ధం చేశారు. తల్లినుంచి పాలు సేకరించడానికి అవసర మైన పనిముట్లను ఉంచారు. పాలు ఉత్పత్తి కానీ తల్లి కన్న బిడ్డకు పాల బ్యాంకు నుంచి అందిస్తారు. బిడ్డకు పట్టిస్తారు.

దాతల సహకారం

తల్లిపాల బ్యాంకు కోసం భీమవరంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.1.50 కోట్లు వెచ్చిస్తున్నారు. దాతలు ముందుకు వస్తున్నారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ తరుపున సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేశారు. సశేఐహెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత్రి తల్లిపాల బ్యాంకు ప్రారంభించారు. ముగ్గురు మహిళా సిబ్బందిని నియమించారు.

పురిటి తల్లులకు కౌన్సెలింగ్

ఏరియా ఆసుపత్రిలో పాల బ్యాంకుకు చెందిన మహిళా కౌన్సిలర్స్ పురుటి తల్లులకు అవగాహన కల్పిస్తారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తారు. తల్లి నుంచి పాలు ఉత్పత్తి కాకపోతే మసాజ్ ద్వారా పాలు ఉత్పత్తిచేసే విధంగా కౌన్సిలర్లు చర్యలు తీసుకుంటారు. పాలు ఉన్నా సరే పాలు తాగటానికి ఇబ్బంది పడుతుంటే తల్లికి శిక్షణ ఇస్తారు. ఏ పొజిషన్‌లో ఇవ్వాలో అవగాహన కల్పిస్తారు. పుట్టిన బిడ్డకు పాలు తాగించిన తరవాత కూడా పాలు ఉంటే ఆ తల్లి నుంచి పాలను సేకరిస్తారు. వాటిని పూర్తిస్థాయిలో మైనస్ 20 డిగ్రీల వద్ద భద్రపరుస్తారు. తల్లి పాలు అవసరమైనవారికి అందజేస్తారు. మామూలుగా ఉంచితే 4 గంటలు వరకు ఉపయోగంలో ఉంటాయి. ఫ్రిజ్‌లో ఉంచితే 24 గంటల వరకు పనిచేస్తాయి. అదే మైనస్ 20 డీగ్రీల వద్ద ఉన్న శీతల మిషన్‌లో ఉంచితే 6నెలలకు పైగా ఉపయోగంలో ఉంటాయి.

పాలామృతం కొందరికే..

తల్లిపాలు అందని పురిటి బిడ్డలు ఎందరో ఉన్నారు. దేశంలో అనేక మంది పిల్లలకు తల్లి పాల పోషణ కరువైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం పిల్లల మరణాలకు 53శాతం శ్వాస కోశ వ్యాధులు, 55 శాతం నీళ్ళ విరోచనాలు కారణమని తెలిపింది. 6నెలలు పాటు పిల్లలకు తల్లిపాలు అందకపోవమే కారణమని గుర్తించింది. మన దేశంలో 24.5 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లిపాలు అందిస్తున్నారు. అందరి పిల్లలకు తల్లిపాలు అందలనే ఆశయంతోనే తల్లిపాలు బ్యాంకును ఏర్పాటుచేశారు.

అంతా ఉచితమే

తల్లిపాల బ్యాంకులో నుంచి పాలు తీసుకుంటే ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా ఉచితంగానే సేవలు అందిస్తారు. ప్రస్తుతం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న తల్లుకు మాత్రమే అవగాహన కల్పిస్తారు. బయటనుంచి ఏతల్లి అయినా బ్యాంకుకు పాలు అందించినా స్వీకరిస్తారు. అయితే సంబందిత తల్లికి సంబంధించి మెడికల్ రిపోర్టు వీరికి అందించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించిన తరువాతనే పాలను సేకరించుకుని భద్రపరుస్తారు.

తల్లిపాలుతోనే ఆరోగ్యం

ప్రవీణ్ కుమార్ ఎండీ, పిడియాట్రిక్-భీమవరం ప్రభుత్వాసుపత్రి



తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం. బిడ్డపుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలను పట్టించాలి. చిక్కగా ఉంటాయ ని కొంత మంది పట్టించరు. అది తప్పు. ఆ పాలల్లో పోషక విలువలు ఎంతో ఉంటాయి. తప్పక పట్టించాలి. దీని వల్ల తల్లి ఆరోగ్యానికి ఎంతో మంచిది. 6నెలలుపాటు ఇవ్వటం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరిగి నీళ్ళ విరోచనాలు, దగ్గు, జ్వరాలు వంటివి రావు.

తల్లి-బిడ్డ మధ్య ప్రేమాను బంధం

తల్లి పాలను ఇవ్వటం వల్ల వారి ఇద్దరి మధ్య అనుబంధం పెరగటానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయక్యాన్సర్ నివారణకు తోడ్పడుతున్నది.

అవగాహన ఎంతో అవసరం

తల్లి పాల బ్యాంకు వల్ల ఎటువంటి ప్రయోజనం అనేది అందరికి అవగాహన ఎంతో అవసరం. అందుకే ముందుగా బ్యాంకు గురించి అవగాహన పెంచే విధంగా స్వచ్ఛంద సంస్థలు ప్రచారంచేసి ప్రజలల్లోకి తీసుకువెళ్తే భవిష్యత్‌లో బ్యాంకు ఎంతో మంది పిల్లలకు ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

క్రైమ్ కార్నర్

లారీ ఢీకొని గొర్రెల కాపరి మృతి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండ్రుప్రోలు జాతీయ రహదారిపై గొర్రెల మందలను మళ్ళీస్తుండగా లారీ అతి వేగంగా వచ్చి ఢీకొన్న ప్రమాదంలో గొర్రెల కాపరి తీర్థాల ఆదియ్య (43) అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం చింతయిగూడెంకు చెందిన ఆదియ్య తన గొర్రెల మందలతో 15 రోజుల క్రితం ఇంటి నుంచి తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ప్రాంతాల్లో వరిచేలలో మేపేందుకు వచ్చాడు. ఆదివారం కుంచనపల్లిలో గొర్రెల మందలను మేపి తిరిగి బాదంపూడి వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా శశి కళాశాల ఎదురుగా వచ్చే సరికి లారీ అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. ఈమేరకు భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

చెరువులో గేదెను కాపాడబోయి వ్యక్తి మృతి

చింతలపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం గ్రామంలో చెరువులో పడి ఉన్న గేదెను రక్షించబోయి గ్రామానికి చెందిన అనుపోజు ధర్మలింగాచారి(52) మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం చెరువులో ఉన్న గేదె కాళ్లకు ఉన్న లంకెను తొలగించడానికి చెరువులోకి దిగిన ధర్మలింగాచారి లంకె తొలగించే సమయంలో గేదె మీద పడటంతో చెరువులోనే అతను మృతి చెందాడు. గేదె కూడా మృతి చెందింది. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృత దేహాన్ని వెలికితీశారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేపి దర్యాప్తు చేస్తున్నారు.

జరిమానా సరిచేశాం : డీటీసీ

ఏలూరు క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒక బొలెరో వాహనానికి కోటి 70 లక్షల రూపాయలు జరిమానాను ఆన్‌లైన్ టెక్నికల్ ఎర్రర్ రావడం వల్లే రసీదు వచ్చిందని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. బొలెరో వాహనం మూడు టన్నులు అదనంగా ఉండడంతో ఆ వాహనం ఆన్‌లైన్ విధించే సమయంలో టన్నులకు బదులుగా మూడు వేల కేజీలని నమోదు చేసే సమయంలో పొరపాటు జరిగిందని దీని వల్ల కోటి 70 లక్షల రూపాయలు జరిమానాగా రసీదు రావడం జరిగిందన్నారు. అయితే జరిమానాను ఆన్‌లైన్‌లో సరిచేయడానికి ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం సరిచేసినట్లు తెలిపారు. ఆ వాహనానికి 26 వేల 200 రూపాయలు మాత్రమే జరిమానా విధించి యజమానికి తెలియజేశామని అన్నారు.

బంగారం వ్యాపారి పట్టివేత

» 6.786 కేజీల బంగారం, 106 కేజీల వెండి, కారు, రూ.3లక్షల నగదు స్వాధీనం
» తోటి వ్యాపారులకు కుచ్చుటోపీ ...ఆపై పరార్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పుల భయంతో తోటి వ్యాపారుల వద్ద బంగారం, వెండి, నగదు సేకరించి ఊరు నుంచి వెళ్లిపోయాడని డీఎస్పీ డి.విశ్వనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం బంగారు వ్యాపారుల వద్ద బంగారం పట్టుకుపోయిన మాన్వీ జ్యూయలర్స్ యజమాని లెంకా రమణ బాబు అరెస్టు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన మాన్వీ జ్యూయలర్స్ యజమాని బులియన్ వ్యాపారిగా చేసిన అనుభవం ఉంది. అయితే తన తండ్రి దశాబ్దాలుగా బంగారం వ్యాపారుల వద్ద నమ్మకంగా బులియన్ వ్యాపారిగా నమ్మకం పెంచుకున్నాడు. ఆ తండ్రిపై ఉన్న నమ్మకంతో రమణబాబును నమ్మి తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన బంగారు వ్యాపారులు రమణబాబుకు భారీగా బంగారం, వెండి ఇచ్చారు. అప్పటికే అప్పుల భయంతో ఉన్న రమణబాబు ఒకేసారి భారీగా బంగారం, వెండి సేకరించి ఆ సొత్తుతో ఊరు నుంచి వెళ్లిపోయాడు. రమణబాబుకు బంగారం ఇచ్చిన వ్యాపారులకు అనుమానం వచ్చి ఆరా తీస్తే పరారయ్యాడని నిర్ధారించుకున్నారు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికి 33 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ విశ్వనాథ్ పర్యవేక్షణలో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు హైదరాబాద్, కొవ్వూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో తిరుగుతూ అతని వద్ద ఉన్న బంగారం, వెండి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం రావడంతో రమణబాబును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.3లక్షల నగదు, 6.786 కేజీల బంగారం, 106.772 కేజీల వెండి, కారు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

వైఎస్ఆర్‌కాలనీలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్‌కాలనీ లో సోమవారం పట్టపగలు తాళం వేసిన ఇంటి తలుపు పగలగొట్టి చోరీ చేశారు. కాలనీలో నివాసం ఉంటున్న లక్కు లక్ష్మి ఇంటిలో రూ.60వేల నగదు, మూడు బంగారపు ఉంగరాలు, సుమారు కేజీ విలువ చేసే వెండి వస్తువులు అపహరించుపోయారు. చోరీ జరిగిన సమయంలో బాధితురాలు ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో శబ్దాలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి బయటకురాగా దొంగ పారిపోవడాన్ని గమనించారు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ చిక్కలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించారు. ఈకేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాలరావు చెప్పారు.

మద్యం మత్తులో డ్రెయిన్‌లో దూకిన వ్యక్తి



భీమవరం క్రైం, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని గరగపర్రు రోడ్డులో బీవీ రాజు విగ్రహం సమీపంలోని వంతెన పైనుంచి ఒక వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బీవీ రాజు విగ్రహం సమీపంలో మూడు మద్యం షాపులు ఉన్నాయి. అక్కడ మద్యం తాగిన ఒక వ్యక్తి వంతెనపైకి వెళ్ళి డ్రెయిన్‌లో దూకాడు. దీంతో అది చూసిన కొందరు యువకులు వెంటనే అతనిని కాపాడారు. చివరకు ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆసుపత్రికి తరలించినట్లుగా తెలిపారు.

ఈవ్ టీజింగ్ చేస్తున్న వ్యక్తిపై బైండోవర్ కేసు

అత్తిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండలం బల్లిపాడు ఉన్నత పాఠశాల వద్ద ఈవ్‌టీజింగ్ చేస్తున్న గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన పులిదిండి రవితేజ అనే యువకునిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. రవితేజ ఉన్నత పాఠశాల వద్ద తరచూ బాలికలను ఈవ్‌టీజింగ్ చేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు రవితేజను అదుపులోకి తీసుకొని తహసిల్దార్ దశిక వంశీ కోర్ట్‌లో హాజరుపరిచారు. రవితేజ నుంచి బైండ్ ఓవర్ పత్రాలను తీసుకున్నట్లు తహసీల్దార్ వంశీ తెలిపారు.



కొబ్బరి చెట్టుకు నిప్పు

పరుగులు తీసిన ప్రజలు

పెనుమంట్ర, డిసెంబర 23 (ఆంధ్రజ్యోతి) : మార్టేరులో ఆదివారం రాత్రి అసలు ఏం జరిగిందో తెలియదు కానీ ఒక్కసారిగా కొబ్బరి చెట్టుకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు పరుగులు తీశారు. నిప్పంటుకున్న కొబ్బరి చెట్టుకు సమీపంలోనే హెచ్.పీ గ్యాస్ గొడౌన్ ఉన్నది. కొబ్బరి చెట్టు కింద ఉన్న తాటాకు ఇంట్లో గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే కొందరు పది గ్యాస్ సిలిండర్లు ఉంచారు. ప్రమాదం జర గడంతో స్థానికులు పరుగులు తీశారు ఆ క్రమంలోనే ఆ తాటాకు ఇంట్లో గ్యాస్ బండలను స్థానికుల సహకారంతో తరలించారు. చుట్టుపక్కలకు మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని జనావాసాల్లో ఉన్న గ్యాస్ ఏజెన్సీని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.



అంబులెన్స్‌లో కోలనపల్లికి జాన్ డేవిడ్ మృతదేహం

కోలనపల్లి యువకుడు లెబనాన్‌లో మృతి

నెల రోజుల తర్వాత స్వగ్రామం చేరుకున్న మృతదేహం

కాళ్ళ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దేశం విడిచి వెళ్ళిన యువకుడు విగతజీవిగా తిరిగి వచ్చాడని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కాళ్ళ మండలం కోలనపల్లికి చెందిన యాళ్ళ జాన్ డేవిడ్ (26) జీవనోపాధి నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం ఖత్తర్ దేశానికి వెళ్ళాడు. అక్కడ ఒక స్పాన్సర్ దగ్గర హౌస్ మేడ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం జాన్ డేవిడ్‌ను స్పాన్సర్ లెబనాన్ దేశానికి తీసుకువెళ్ళాడు. అక్కడ గత నెల 24వ తేదీన జాన్ డేవిడ్ గన్ శుభ్రపరుస్తుండగా మిస్ ఫైర్ జరిగి చనిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇండియాకు రప్పించడం కోసం భీమవరంలో ఉన్న నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్టని సంప్రదించారు. ట్రస్ట్ కో-ఆర్డినేటర్ రవి లెబనాన్‌లో ఉన్న ఇండియన్ ఎంబసీకి జాన్ డేవిడ్ మరణ వార్త తెలియజేసి మృతదేహాన్ని ఇండియాకు రప్పించారు. హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఏపీఎన్ ఆర్టీఎస్ వారు ఉచిత అంబులెన్స్‌లో మృతదేహాన్ని కోలనపల్లిలోని డేవిడ్ ఇంటికి సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు.

రహదారులకు మోక్షం

» ఎమ్మెల్యే ఆరిమిల్లి చొరవతో పూర్తిస్థాయిలో రోడ్లు



నిర్మాణ పనులు పూర్తయిన ఏలేటిపాడు-ఐతంపూడి రోడ్డు (ఇన్‌సెట్‌లో) గతంలో గోతులతో ఉన్న దృశ్యం

తణుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా ధ్వంసమైన రోడ్లపై ప్రయాణించేందుకు ప్రజలు, వాహనదారులు నరకయాతన చవిచూశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం తట్టమట్టితో గోతులు పూడ్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ముఖ్యమైన రోడ్లను సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా మార్చాలని కోట్ల రూపాయలతో పనులు చేసేలా ప్రణాళికలు రుపొందించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రత్యేక చొరవతో రూ.59 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని రోడ్లు గుంతలు లేని రోడ్లులుగా తీర్చిదిద్దేవిధంగా నిధులు మంజూరు చేయించారు. ప్రధానంగా ఆర్‌అండ్‌బీ పనులు ఇరగవరం మండలం ఏలేటిపాడు నుంచి ఐతంపూడి వెళ్లే రోడ్డును మూడు కోట్లతో రోడ్డు పనులు పూర్తిచేశారు. తణుకు వేల్పూరు, మహాలక్ష్మి చెర్వు, యర్రయ్య చెర్వు పనులు ఎనిమిది కిలోమీటర్ల మేర నాలుగు కోట్లతో, కొమరవరం నుంచి తూర్పువిప్పర్రు 3.8 కిలో మీటర్లు కోటి 50 లక్షలతో, ఐతంపూడి నుంచి కొత్తపాడు 4.9 కిలో మీటర్లు రూ.4.90 కోట్లతో, సిద్ధాంతం నుంచి జుత్తిగ, కత్తవపాడు, పొదలాడ రోడ్డు రూ.60 లక్షలతో, తణుకు, భీమవరం రోడ్డు రూ.32 కోట్లతో పనులు జరుగుతున్నాయి.


ఎంపీ పురందేశ్వరికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న వైఎన్ పాలకవర్గం

'వైఎన్' వేడుకలకు ఎంపీ పురందేశ్వరికి ఆహ్వానం

నరసాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైఎన్ కళాశాలలో వచ్చేనెల 11న జరిగే ప్లాటినం వేడుకలకు రావాలంటూ వైఎన్ కళాశాల యాజమాన్యం ఎంపీ పురందేశ్వరికి ఆహ్వానం అందించారు. సోమవారం రాజమండ్రిలోని ఎంపీ కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వాన ప్రతికను అందించారు. ఆమె వస్తానని హామీ ఇచ్చినట్టు ఆహ్వాన కమిటీ తెలిపింది. కోశాధికారి పోలిశెట్టి రఘురాం, ప్రిన్సిపాల్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, ఎ.నారాయణరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత హరికృష్ణ

కాళ్ళ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెద అమిరం మాజీ సర్పంచ్ భర్త, వైసీపీ సీనియర్ నాయకుడు ఇళ్ళ హరికృష్ణ సోమవారం టీడీపీలో చేరారు. పెద అమిరం గ్రామానికి చెందిన ఆయన భార్య గతంలో గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. గడిచిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో కీలక నాయకుడిగా ఉన్న హరికృష్ణ చంద్రబాబునాయుడుపై ఉన్న అభిమానం, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితుడినై పార్టీలో చేరానన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ సీనియర్ నాయకుడు కఠారి వెంకట నరసింహరాజు, గ్రామ అధ్యక్షుడు ముదుండి రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.


వేల్పూరులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు దృశ్యం

తీరనున్న పలు గ్రామాల్లో లో-వోల్టేజి సమస్య

తణుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేల్పూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా కోటి రూపాయలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని వేల్పూరు, వీరభద్రపురం, కొమరవరం, మహాలక్ష్మిచెర్వు, యర్రాయిచెర్వు, ఇరగవరం మండలం రేలంగి, కావలిపురం గ్రామాల వినియోగదారులకు లో-వోల్టేజీ సమస్య అధిగమించవచ్చని అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు ఆయా గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించామన్నారు.



చాంబర్స్ సొసైటీ కరస్పాండెంట్‌గా సీతారామరాజు ఏకగ్రీవం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్‌గా కనుమూరి వెంకట సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఛాంబర్స్ కళాశాలల ఆవరణలో కళాశాల పాలక మండలి చైర్మన్ కారుమూరి వెంకట రత్న నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీతారామరాజు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఛాంబర్స్ అనుబంధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పాలకమండలి సభ్యులు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.


కేక్ కట్ చేస్తున్న డీపీఆర్‌వో నాగేశ్వరరావు

ఆనందాన్ని నింపేదే క్రిస్మస్ పండుగ

భీమవరంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ అని, క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపుతుందని జిల్లా పౌర సంబంధాల అధికారి టి.నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత రికార్డ్ అసిస్టెంట్ దేవరకొండ సోమరాజుతో కేకును కట్ చేయించి డీపీఆర్‌వో, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలలో సీనియర్ అసిస్టెంట్ కేటీఎంకే సత్యనారాయణరాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాసనెహ్రూ, రికార్డు అసిస్టెంట్ దేవరకొండ సోమరాజు, ఫొటోగ్రాఫర్ పి.వై. రత్నాకర్, టెక్నికల్ సబార్డినేట్ పి.వీరభద్రం పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో మాంటిస్సోరి విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

తణుకు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తణుకు మాంటిస్సోరి విద్యార్థులకు రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలలో పలువురు బహుమతులు సాధించారు. సోమవారం భీమవరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి విద్యార్థులను అభినందించారు. ఇటీవల తమిళనాడులో కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయస్థాయి 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో బహుమతులు సాధించినట్టు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. మోయి త్రీదాస్ ఇన్‌లైన్ హాకీలో అండర్-11 విభాగంలో బంగారు పతకం, నిత్యేష్ గౌడ్ రోలర్ హాకీలో మిక్స్‌డ్ అండర్-11 విభాగంలో కాంస్య పతకం, రోలర్ హాకీ మిక్స్‌డ్ అండర్-14 విభాగంలో జి.జశ్వంత్, ఎం.నాగసాయి కేశవ్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్, యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ జ్ఞానమంజరి తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు మండల కార్యదర్శుల కార్యవర్గ నియామకం


కార్యవర్గ జాబితాను ఎంపీడీవో బాలాజీ వెంకటరమణకు అందజేస్తున్న కార్యదర్శులు

పెంటపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు మండలం పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా దత్తి అప్పారావు (జట్లపాలెం), అధ్యక్షుడిగా జవ్వాది నాగేశ్వరరావు (ప్రత్తిపాడు), ఉపాధ్యక్షుడిగా వి.శోభన్‌కుమార్ (పడమరవిప్పర్రు), ప్రధాన కార్యదర్శిగా ఎం.శేఖర్‌బాబు (రావిపాడు), జాయింట్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు(రాచర్ల), కోశాధికారి ఈ.ఫణీంద్రకుమార్ (కోరుమిల్లి), మహిళా సంయుక్త కార్యదర్శి కె.శకుంతల (ఆకుతీగపాడు) కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి ఎంపీడీవో చీకట్ల బాలాజీవెంకటరమణ, సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, నాగదేవి, గోడి బాలకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నాచు వెంకట్రామయ్యకు ఘన నివాళి

భీమవరంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే నాచు వెంకట్రామయ్య 29వ వర్థంతి కార్యక్రమాన్ని మునిసిపల్ కార్యాలయం వద్ద, నాచు వారి సెంటర్‌లోని విగ్రహాల వద్ద విగ్రహ కమిటీ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారఽథి, కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తాడేరు రోడ్డుకు నాచు వెంకట్రామయ్య మార్గ్‌గా నామకరణం చేయాలని కోరారు. విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కాగిత వీర మహంకాళిరావు, నల్లం వీరస్వామి, గ్రంధి వెంకట్రావు, చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు ఎండి నౌషాద్ తదితరులు ఉన్నారు.

బండారు ప్రతాప్‌నాయుడుకు కన్నీటి వీడ్కోలు


అంతిమ యాత్రలో మాధవనాయుడు, విప్ నాయకర్ తదితరులు

నరసాపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తండ్రి ప్రతాప్‌నాయుడు అంతిమ యాత్ర సోమవారం ఆయన స్వస్థలం సరిపల్లి గ్రామంలో జరిగాయి. ఇంటి నుంచి శ్మశానం వరకు జరిగిన అంతిమ యాత్రలో గ్రామస్థులతో పాటు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు. విప్ నాయకర్, షైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, చాగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. మాధవనాయుడిని ఎమ్మెల్సీ వంకా రవీంద్రతో పాటు పలు పార్టీ నాయకులు పరామర్శించారు.

జియో ట్యాగింగ్‌తో విపత్తుల్లో ఉపయోగకరం

ఆకివీడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల సమయంలో కుటుంబాల వివరాలు తెలుసుకునేందుకు ఇంటింటికి జియో ట్యాగింగ్ చక్కగా ఉపయోగపడతుందని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. సోమవారం స్థానిక రాణా వీధిలో సచివాలయ ఉద్యోగులు మొబైల్ యాప్‌లో ప్రజల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో సుమారు పది వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు ఘన నివాళి

గణపవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి ఖ్యాతిని ప్రపంచస్థాయికి పెంచిన మహోన్నతుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. పిప్పరలోని తన పార్టీ కార్యాలయంలో సోమవారం దివంగత పీవీ నరసింహారావు వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు పీవీ నరసింహరావు అని, ఇంగ్లీష్, హిందీతో పాటు 17 భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. ఆయన ఆశయాలు నేటి యవతకు దోహదపడతాయన్నారు. నివాళులర్పించిన నాయకులలో గణపవరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జీడికుంట్ల చంద్రశేఖర్, కొండరాజు, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలకొల్లు పొలాల్లో రైతులను సత్కరిస్తున్న కాపు వనిత క్లబ్ సభ్యులు

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

పాలకొల్లు రూరల్/పెనుగొండ/నరసాపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం పాలకొల్లులోని కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో రైతులను సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి ఎదిగిన మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. క్లబ్ సభ్యులు డి.కాంచన మాల, సిద్ధిరెడ్డి శైలజారాణి, పలువురు రైతులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పెనుగొండ భాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకట అప్పారావు ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు జానపదుల వేషధారణలతో ఆడి పాడి అలరించారు. భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, రాణీ రోజాజి, విద్యార్థులు పాల్గొన్నారు. నరసాపురం మండలంలోని కొప్పర్రు మండల పరిషత్ స్కూల్‌లో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం రాజశ్రీ విద్యార్థులక రైతు బిడ్డ వేషధారణలు చేపట్టారు. రైతులు చేసే పనుల్ని విద్యార్థులకు వివరించారు.

నాణ్యమైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారం

» ఎమ్మెల్యే అంజిబాబు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. దొంగపిండి గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. చిన్నారులను పేర్లు అడిగి తెలుసుకుని మెనూ ప్రకారం ఆహారాన్ని పరిశీలించారు. నిర్దేశించిన మెనూను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తన పరిశీలనలో తేలితే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి కోళ్ళ నాగేశ్వరరావు, సర్పంచ్ రేవతి, మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, రేవు వెంకన్న, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, గ్రామ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ. 82 లక్షలతో ఆరు గ్రామాలైన బేతపూడి, తుందుర్రు, యనమదుర్రు, కొత్తపూసలమర్రు, దొంగపిండి, తోకతిప్పలలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.

రూ. 9.42 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుమంట్ర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆచంట నియోజకవర్గంలో పేద వర్గాలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన తొమ్మిది మందికి 9 లక్షల 42 వేల 611రూపాయల చెక్కులను బాధితులకు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అందజేశారు. పెనుమంట్ర మండలానికి చెందిన పడాల మాణిక్యంకు రూ.1,22,323, ఓడూరుకి చెందిన వి. లక్ష్మికి రూ.1,54,346, వెలగలేరుకు చెందిన పడాల సూర్యనారాయణ రెడ్డికి రూ. 45వేలు, కొడమంచిలికి చెందిన నున్నబోయిన నాగరాజుకు రూ.80,967, నెక్కంటి సూర్యకుమారికి రూ.2,92,054 బండారు సుబ్రహ్మణ్యం బలంవారిపాలెం రూ.19,551, ఆచంట వేమవరం వేలిచేటి సూర్యనారాయణ రూ.1,80,413, కవిటంకి చెందిన చింతాడ నిరూపమకు రూ.3,26,864, చిన్నమల్లానికి చెందిన గుడాల లక్ష్మికి రూ.1,00,880 చెక్కులను అందజేశారు ఆలమూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు తేతలి వెంకటరామరెడ్డి, బాలం రమణ, మాజీ సర్పంచి సత్యనారాయణమూర్తి, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు ఇందుకూరి వెంకట నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో చెరువులకు అనుమతులు ఇవ్వొద్దు


మొగల్తూరులో అధికారులకు ఫిర్యాదు అందిస్తున్న గ్రామస్థులు

కాళ్ళ/మొగల్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జనావాసాల మధ్య చెరువులకు అనుమతులు ఇవ్వవద్దని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కాళ్ళ గ్రామంలోని జగనన్న కాలనీ వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పెదపాటిదిబ్బ ఏరియాలో ఉన్న 'జగనన్న కాలనీ'లో నివసిస్తున్న సుమారు 120 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికీ ఈ కాలనీకి దక్షిణం, ఉత్తరం వైపున ఆక్వా చెరువులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం కాలనీకి పడమర వైపు ఉన్న పొలాలను చెరువులుగా చేసేందుకు కొంత మంది ఆక్వా రైతులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సదరు శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆక్వా చెరువుల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయకుండా చూడాలని కోరారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నాలుగు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ తెలిపారు. పల్లవపాలెంకు చెందిన కొప్పాడ సురేష్ తన ఇంటి వద్ద నుంచి ప్రధాన రోడ్డుకు వచ్చే దారిమార్గాన్ని మూసివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని న్యాయం చేయాలని కోరారు. ఎంపీడీవో సీహెచ్ త్రిశూల పాణి, డీటీ సుగుణ సంధ్య, జేఈలు వెంకటేశ్వరరావు, మోహనరావు, ఏవో రహీమ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ నిత్యాన్నదానానికి రూ.1,01,116 అందజేత


విరాళం నగదు అందిస్తున్న భక్తులు

భీమవరంటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానానికి ఉండికి చెందిన మారెళ్ల నరసింహారావు పేరు మీద ఆయన భార్య రుక్మిణి నాగకామేశ్వరి, కుమార్తె కమల గాయత్రీ ఒక లక్ష వెయ్యి నూట పదహారు రూపాయలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి, ప్రసాదాలు శేషవస్త్రం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.

ఆధ్యాత్మికం

అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామికి పూజలు


అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి అండాళ్ళమ్మ వార్లకు హారతి దృశ్యం

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం 8వ రోజు సోమవారం వైష్ణవ ఆలయం అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామి, అండాళ్ళమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవారికి తిరుమంజన సేవలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం రేపాక సుధారాణి వీణాగానంతో ప్రభాత సేవ చేశారు. అనంతరం టీటీడీ ప్రబంధ ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. ఈవో బీవీవీ సత్యనారాయణ శంకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతం

ఆకివీడు రూరల్ : ఆకివీడు మండలంలోని నంద్యాల సీతారామయ్య నివాసంలో జయలక్ష్మి అమ్మవారి సన్నిధిలో భక్తులు అనఘాష్టమి వ్రతాన్ని ఆచరించారు. ప్రతిఏటా మార్గశిర మాసంలో కృష్ణపక్షంలో వచ్చే అష్ట మిరోజున ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. వ్రతం అనంతరం అన్నసమారాధన జరిగింది. కత్రెడ్డి సత్యనారాయణ, యర్రగోగు పాండురంగారావు, అల్లాడి శివన్నారాయణ, అంజి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దత్తుని పాదుకలకు పూజలు

పాలకొల్లు అర్బన్ : ప్రధాన అనఘాష్టమి సందర్భంగా స్థానిక 14వ వార్డులో దాత వెలువలి నాగవెంకట రమణ శర్మ, సింధు దంపతులు దత్తపీఠానికి విరాళంగా ఇచ్చిన స్థలంలో సోమవారం గణపతి సచ్చిదానద జ్ఞాన బోధసభ, శ్రీజయలక్ష్మీమాత మాతృమండలి సభ్యులు సంయుక్తంగా వేద పండితులు, శివదుర్గ పండితుల బ్రహ్మత్వంలో స్వామివారి అనఘాష్టమి వ్రతాలు, పారాయణలు నిర్వహించారు. అనంతరం దత్త బిక్ష (అన్న సమారాధన) ప్రసాద వినియోగం గావించారు. కమిటీ సభ్యులు సీహెచ్ రామలింగేశ్వర శాస్త్రి, ఎ.కృష్ణాజీ, ఎ.సాయి, సాయీ వెంకటేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, బీవీ వాసవీదుర్గ, జ్యోతి, దదితరులు పాల్గొన్నారు.

5న హైందవ శంఖారావం సభకు తరలిరావాలి

మొగల్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతీ ఒక్కరూ తరలిరావాలని సమరత సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు. సోమవారం ఈ మేరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాతపాడు గ్రామంలో నిర్వహించిన ప్రచారం ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ హిందూదేవాలయాల నిర్వహణను హిందువులకే అప్పగించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాలు స్పందించాలనే లక్ష్యంతో సభ నిర్వహిస్తున్నామన్నారు. తమ్ము వెంకటరమణమూర్తి, కొపనాతి ఏడుకొండలు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు చేయండి

మొగల్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖాళీ స్థలాల్లో, ఇంటి పెరటిలో కూరగాయల సాగు చేయాలని తహసీల్దార్ రాజ్‌కిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రసాయనాలు వేయకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయల విక్రయ స్టాల్‌ను వారు సందర్శించి మాట్లాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక గల సుమారు రెండు ఎకరాల స్థలంలో ఎవరైనా ముందుకు వచ్చి ప్రకృతి సాగుతో కూరగాయలు పండించుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఏవో అబ్దుల్ రహీమ్, డీటీ సంధ్య, ఈవోపీఆర్‌డీ నవీన్‌కిరణ్, పలు శాఖల అధికారులు కూరగాయలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మీకుమారి, ఉంగరాల రామలక్ష్మి, శీలం మహాలక్ష్మి, గురుజు కనకదుర్గాభవాని, పుష్ప పాల్గొన్నారు.


మోహనరావును సన్మానించిన సంఘ నాయకులు

శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా మోహనరావు ఎన్నిక

మొగల్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాళీపట్నం పడమర గ్రామంలో సోమవారం శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా జక్కంశెట్టి మోహనరావును, సంఘ పెద్దలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గ్రామంలోని పెద్దలు సంఘ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

దర్భరేవు లాకులకు మరమ్మతులు చేపట్టాలి

» రైతుల ఆందోళన

నరసాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దర్భరేవు లాకులకు మరమ్మతులు చేపట్టాలని ఎల్‌బీచర్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. లాకుల నిర్వహణ గాలికి విడిచిపెట్టడం వల్ల ప్రతి ఏటా సార్వా పంటను నష్టపోతున్నామన్నారు. ఎనిదేళ్ల పాటు మొదటి పంటను కోల్పోతున్నామన్నారు. పంట పొలాల్లో ముంపు నీరు వెళ్లకపోవడం వల్ల దాళ్వా పంటను వదులుకోవాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి లాకుల నిర్వహణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం అందించారు. కటకంశెట్టి మాణిక్యాలరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

పాలకొల్లు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వడ్లవానిపాలెంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మోడల్ టీమ్ లీడర్ మురళీకృష్ణ, నేషనల్ ఫార్మింగ్ అసోసియేట్ జెండర్ కృపావతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరూ పోరాడాలన్నారు. వీవోఏ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం పద్మావతి, భానుశ్రీ, నవీన్, మేకర్ నాగరాజు, సీఆర్‌పీ శ్రీలక్ష్మీమీనా, సత్యనారాయణ, సూరిబాబు, శ్రీనివాస్, పద్మ, ఎం.మేరీగోల్డ్, ఐ.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏవో పార్థసారధి సూచించారు. సోమవారం రావిపాడు, ఆకుతీగపాడు, చింతపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ లోగా రూ.615 చెల్లించి రైతులు, కౌలు రైతులు బీమాలో నమోదు కావాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తక్కువ ఖర్చుతో రైతులు అధిక రక్షణ పొందవచ్చన్నారు.